జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com





# ఫిర్యాదు తీసుకోను.. ఏం చేసుకుంటారో.. చేసుకోండి

* నేను ఎవరికీ భయపడను
* నాకు ఉన్నతాధికారుల అండ ఉంది
* ఫిర్యాదు కాపీని ఫిర్యాదుదారునిపై విసిరికొట్టిన టు టౌన్ ఎస్ఐ లక్ష్మీ
* ఆర్మీ హవాల్దార్‌పై రుసరుసలు
* ఇదేనా ఫ్రెండ్లీ పోలీసింగ్.. అంటూ ఫిర్యాదుదారుడి ఆవేదన
* పీఎస్‌లో సీసీ కెమెరాలు పరిశీలిస్తే నిజాలు బట్టబయలు
* ఎస్పీ దృష్టికి తీసుకువెళ్లేందుకు సిద్ధమవుతున్న ఫిర్యాదుదారుడు (ఆర్మీ హవాల్దార్)
* జిల్లాలో ఒకరిద్దరు ఎస్ఐల తీరుపై విమర్శలు
* సారవకోట ఎస్ఐపై కలెక్టర్‌కు సోషల్ జస్టిస్ వెల్ఫేర్ సొసైటీ ఫిర్యాదు
* కొందరి వల్ల జిల్లా పోలీసు శాఖకు మచ్చ

**శ్రీకాకుళం క్రైం, మార్చి 23 (వార్త):** పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేసేందుకు వచ్చిన వారితో మర్యాదగా వ్యవహరించాలి.. వారిని కూర్చోబెట్టి సమస్యను సావధానంగా వినాలి.. వారికి న్యాయం జరిగేలా చూడాలి.. ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు కావాలి.. అని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి జిల్లా పోలీసులకు సూచిస్తున్నా.. కొందరు మాత్రం తమ తీరును మార్చుకోవడం లేదు. కొందరు ఎస్ఐలు అక్రమాలు, అవినీతి, దందాలకు పాల్పడినట్లు తన దృష్టికి వస్తే వెంటనే వీఆర్‌కు ఎస్పీ పంపిస్తున్నారు. అయినప్పటికీ జిల్లాలోని ఒకరిద్దరు ఎస్ఐల దురుసు ప్రవర్తన వల్ల జిల్లా పోలీసు శాఖకు మచ్చ తెస్తోంది. సారవకోట ఎస్ఐ అనిల్ కుమార్‌పై.. సోషల్ జస్టిస్ వెల్ఫేర్ సొసైటీ ఏకంగా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. శ్రీకాకుళం రెండో పట్టణ ఎస్ఐ లక్ష్మీ తీరుపై కూడా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. స్టేషన్‌కు ఫిర్యాదు చేసేందుకు వచ్చిన వారిపై ఆమె చిందులు వేయడం, ఫిర్యాదు తీసుకోనని, ఎవరికి చెప్పుకుంటారో చెప్పకోండని, ఏం చేసుకుంటారో చేసుకోండని రుసరుసలాడడం చర్చనీయాంశమైంది.




తన కుమారుడిపై ఓ వ్యక్తి దాడి చేయడంతో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన ఓ ఆర్మీ అధికారి (హవల్దార్)పైనే ఎస్ఐ లక్ష్మీ చిందులేయడంతో ఆయన అవాక్కయ్యాడు. దీనిపై హవాల్దార్.. ఎస్పీకి ఫిర్యాదు చేసేందుకు సిద్ధమయ్యారు.

## అసలేం జరిగింది..

శనివారం సాయంత్రం శ్రీకాకుళం నగరంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఓ బాలుడు సైకిల్ తొక్కుతున్నాడు. అదే మార్గంలో వెళుతున్న స్కూటర్‌పై వెళుతున్న వాహనచోదకుడికి అడ్డంగా ఈ బాలుడు వచ్చాడు. దీంతో వాహనచోదకుడు ఆ బాలుడిపై చేయిచేసుకున్నాడు. ఈ విషయాన్ని ఆ అబ్బాయి తండ్రి ఆర్మీ అధికారి (హవాల్దార్)కు తెలియజేశాడు. దీంతో హవాల్దార్ ఇదే విషయమై వాహనచోదకుడిని నిలదీశారు. దీంతో వాహనచోదకుడు పరుష పదజాలం వాడడంతో.. అదేరోజు రాత్రి శ్రీకాకుళం రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో హవాల్దార్ ఫిర్యాదు చేశారు. ఎస్ఐ లక్ష్మీ ఆ ఫిర్యాదును పరిశీలించారు. న్యాయం చేయాల్సిన ఎస్ఐ ఆ ఫిర్యాదు కాపీని విసిరికొట్టారని, చిన్నచిన్న తగువులకు సైతం స్టేషన్‌కు రావాలా అని, కేసు కట్టనని, ఏం చేసుకుంటారో చేసుకోండని, తాను ఎవరికీ భయపడేది లేదని, తనకు ఉన్నతాధికారులతో పరిచయాలు ఉన్నాయని మండిపడినట్టు హవాల్దార్ ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో హవాల్దార్ వెంటనే ఫిర్యాదు కాపీని పట్టుకుని ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేసేందుకు స్టేషన్ నుంచి బయటకు వచ్చారు. అదే సమయంలో అక్కడికి వచ్చిన సీఐ ఈశ్వరరావు దృష్టికి హవాల్దార్ తీసుకువెళ్లారు. దీంతో ఆయన స్పందించి వాహనచోదకుడిని మందలించారు. ఇరువురికి సర్దిచెప్పి పంపించివేశారు.

## సీసీ కెమెరాలు పరిశీలిస్తే..

ఎస్ఐ లక్ష్మీ తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పోలీస్‌స్టేషన్‌కు న్యాయం కోసం వచ్చే వారిపై ఎస్ఐ ఇలా వ్యవహరించడం ఎంతమాత్రం తగదని హవాల్దార్ వాపోయాడు. తనపైనే ఆమె ఇలా వ్యవహరిస్తే సామాన్య ప్రజలకు ఆమె ఏం న్యాయం చేస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం రాత్రి ఎనిమిది నుంచి తొమ్మిది గంటల మధ్యలో స్టేషన్‌లో ఏం జరిగిందన్నది సీసీ కెమెరాలు పరిశీలిస్తే నిజాలు బయటపడతాయన్నారు. ఈ విషయమై ఎస్పీకి ఫిర్యాదు చేస్తానని హవాల్దార్ 'జాతీయ వార్త'కు తెలియజేశారు.

## సారవకోట ఎస్ఐపై చర్యలు తీసుకోండి

* జిల్లా కలెక్టర్‌కు సోషల్ జస్టిస్ వెల్ఫేర్ సొసైటీ వినతి



సారవకోట మండలం, పనసలోవ గ్రామానికి చెందిన 70 ఏళ్ల గిరిజన వృద్ధుడు మాలవ కారయ్య, అతని భార్యపై కొందరు దాడులకు పాల్పడుతున్నారని, సారవకోట ఎస్ఐ సైతం దాడులకు పాల్పడుతున్న వారికి కొమ్ముకాస్తున్నారని, తక్షణం అతనిపై చర్యలు తీసుకోవాలని సోషల్ జస్టిస్ వెల్ఫేర్ సొసైటీ సోమవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. బాధితుడికి న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా సొసైటీ జిల్లా ప్రధాన కార్యదర్శి జామాన రామారావు మాట్లాడుతూ, చట్టాన్ని రక్షించాల్సిన ఎస్ఐ అక్రమార్కులకు వత్తాసు పలకడం దారుణమన్నారు. కారయ్యకు ప్రభుత్వం మంజూరు చేసిన స్థలాన్ని అదే గ్రామానికి చెందిన గార బారికి, సోమేసు, నీలయ్య, బెజ్జి కృష్ణారావు ఆక్రమించేశారన్నారు. దీనిపై ప్రశ్నించినందుకు గాను వృద్ధ దంపతులపై వారు భౌతిక దాడికి పాల్పడ్డారన్నారు. బాధితుడు సారవకోట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ ఎస్ఐ బి.అనిల్ కుమార్ నిందితులపై చర్యలు తీసుకోలేదన్నారు. సరికదా బాధితులనే భయభ్రాంతులకు గురిచేయడం అత్యంత దుర్మార్గమన్నారు. బాధితులకు న్యాయం జరగని పక్షంలో సోషల్ జస్టిస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్త ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సొసైటీ జిల్లా అధ్యక్షులు బలగ రామారావు, జిల్లా వైస్ ప్రెసిడెంట్ సామ హిరణ్య రావు, ఆర్‌టీఐ జిల్లా ఇన్చార్జ్ కర్రి అమ్మారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి జామాన రామారావు, రామకృష్ణ, లోకొండ సర్పంచ్, ఇతర సభ్యులు ఉన్నారు.

## ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం వద్దు: ఎస్పీ



పబ్లిక్ గ్రీవెన్స్‌లో స్వీకరించే ప్రజా ఫిర్యాదుల పట్ల ఎటువంటి జాప్యం లేకుండా, నిర్లక్ష్యం చేయకుండా త్వరితగతిన విచారణ జరిపి, అర్జీదారులు సంతృప్తి పొందేలా పూర్తి స్థాయిలో పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి జిల్లా పోలీసు అధికారులకు ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల నమోదు పరిష్కార వేదిక కార్యక్రమంలో మొత్తం 55 మంది ప్రజల నుంచి ఎస్పీ ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం ఫిర్యాదు దారులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని, వాటిని సమగ్రంగా పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ప్రజా ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ఎటువంటి నిర్లక్ష్యం లేకుండా వేగవంతంగా పరిష్కారం చూపాలని ఎస్పీ సూచించారు.

# రాత్రి 11 తర్వాత.. ధాబాలు.. బంద్




* టిఫిన్, స్ట్రీట్ ఫుడ్ దుకాణాలు సైతం
* ప్రజలు అనవసరంగా రాత్రివేళ సంచరించొద్దు
* రాత్రివేళ సినిమా నుంచి వచ్చేవారు టిక్కెట్లు కలిగివుండాలి
* ఇకపై ప్రతిరోజు రాత్రి పోలీసు తనిఖీలు
* శ్రీకాకుళం టౌన్ డీఎస్పీ వివేకానంద



**శ్రీకాకుళం క్రైం, మార్చి 23(వార్త):** జిల్లాలో శాంతి భద్రతలను మరింత బలోపేతం చేయడం దృష్ట్యా రాత్రి వేళలో ప్రజలు అనవసరంగా తిరగొద్దని, రాత్రి 11 గంటల తర్వాత ధాబాలు, టిఫిన్ విక్రయించే హోటళ్లు, స్ట్రీట్ ఫుడ్ దుకాణాలు బంద్ చేయాలని జిల్లా పోలీసులు హెచ్చరికలు చేశారు. దీనికి సంబంధించి శ్రీకాకుళం టౌన్ డీఎస్పీ సీహెచ్ వివేకానంద సోమవారం ఒక ప్రకటన జారీ చేశారు. ఇటీవల చోటుచేసుకుంటున్న ఘటనలు నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. అన్ని ధాబాల యజమానులు ప్రతిరోజూ రాత్రి 11 గంటల లోపు తమ ధాబాలను తప్పనిసరిగా మూసివేయాలన్నారు. అనుమతి లేకుండా రాత్రి ఆలస్యంగా ధాబాలను నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ధాబాల వద్ద మద్యం విక్రయాలు, తాగడం, మాదక ద్రవ్యాల వినియోగం, అనవసర గుంపులు చేరడం, శబ్ద కాలుష్యం సృష్టించడం వంటి కార్యకలాపాలను నిషేధిస్తున్నామన్నారు. అలాగే టిఫిన్ సెంటర్లు, స్ట్రీట్ ఫుడ్ దుకాణాలు కూడా రాత్రి 11 తర్వాత మూసివేయాల్సిందేనన్నారు. ఎటువంటి అత్యవసర కారణం లేకుండా ప్రజలు రాత్రివేళ అనవసరంగా సంచరించరాదన్నారు. ఇకపై ప్రతిరోజు పోలీసు తనిఖీలు ఉంటాయన్నారు. రాత్రి వేళల్లో సినిమాలకు వెళ్లిన వ్యక్తులు తిరుగు ప్రయాణంలో సినిమా టికెట్‌ను తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు. ఎవరైనా ఈ ఆదేశాలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని డీఎస్పీ వివేకానంద హెచ్చరించారు.

## పట్టపగలు.. చైన్ స్నాచింగ్!

* ఉపాధ్యాయురాలి గొలుసు చోరీ
* ద్విచక్ర వాహనంపై వచ్చి ఉపాధ్యాయురాలి గొలుసు తెంపి పరారీ
* నరసన్నపేట పోలీసులకు బాధితురాలి ఫిర్యాదు

**నరసన్నపేట, మార్చి 23 (వార్త):** నరసన్నపేటలోని నూకలమ్మ ఆలయం సమీపంలో సోమవారం మధ్యాహ్నం జరిగిన చైన్ స్నాచింగ్ ఘటన కలకలం రేపింది. ప్రైవేట్ పాఠశాలలో పనిచేస్తున్న కె.పద్మ అనే ఉపాధ్యాయురాలు ఇంటికి వెళ్తుండగా, ద్విచక్ర వాహనంపై వచ్చిన గుర్తుతెలియని వ్యక్తులు ఆమె మెడలో ఉన్న రెండు తులాల బంగారు గొలుసును తెంపివేసి పరారయ్యారు. ఆమె తేరుకొని కేకలు వేసినప్పటికీ ఫలితం లేక పోయింది. ఆమె ఫిర్యాదు మేరకు నరసన్నపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుల కోసం గాలింపు చర్యలు చేపడుతున్నట్టు పోలీసులు తెలిపారు.



## అంగన్ వాడీ కేంద్రాలు సక్రమంగా పని చేయాలి

**మందస, మార్చి 23(వార్త):** అంగన్ వాడీ కేంద్రాలు సక్రమంగా పని చేయాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి పెద్దింటి అరుణ చెప్పారు. మందస పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయం సోమవారం అంగన్ వాడీ కార్యకర్తలతో జరిగిన సమావేశంలో అరుణ మాట్లాడుతూ కార్యకర్తలు తప్పక సమయపాలన పాటించాలన్నారు. చిన్నారులను తమ సొంత బిడ్డల్లా చూడాలని కోరారు. ప్రీస్కూల్ సమయాన్ని సక్రమంగా జరగాలని, మెనూ ప్రకారం ఫుడ్ ఫాలో అవ్వాలని సూచించారు. ఎండాకాలం ప్రవేశించడంతో చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు.

అనంతరం మెడికల్ కిట్లు, వంటకు సంబంధించిన పాత్రలు ఆమె పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు, సిబ్బంది కూడా పాల్గొన్నారు.



# సమస్యల వలయంలో దుప్పలవలస

**-రోడ్లపైనే మురుగునీటి ప్రవాహం**

**-పందులు, కుక్కలు స్వైర విహారం**

**- కాలువలో పేరుకుపోయిన చెత్త, మురుగు**

**-అధికారులు స్పందించాలని**

**కోరుతున్న అర్బన్ హౌసింగ్ కాలనీ వాసులు**

**(శ్రీకాకుళం)**

శ్రీకాకుళం నగరానికి శివారులో విలీన పంచాయతీ దుప్పలవలసలో సమస్యలు తిష్ట వేస్తున్నాయి. ఇక్కడి అర్బన్ హౌసింగ్ కాలనీలో నిత్యం సమస్యలతో ప్రజలు సావాసం చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. కాలనీలో ప్రతిరోజూ





పందులు గుంపులు..గుంపులుగా తిరుగుతూ..వీధుల్లో ఉన్న మురుగు కాలువలో దొర్లుతూ దుర్వాసన వెదజల్లుతున్నాయి. కొందరు ఆకతాయిగా రోడ్ల వైపు కాలువలు తీసి మురుగునీరు విడిచి పెడుతున్నారు. దీంతో స్థానికులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. మురుగు కాలువల్లో దోమలు విపరీతంగా వృద్ధి చెంది, ఏ క్షణంలో ఏ రోగం వస్తుందో అని ప్రజలు భయంతో బతకాల్సిన పరిస్థితి దాపురించింది. అధికారులు ఇప్పటికైనా స్పందించి తమ కాలనీ పరిసరాలను బాగు చేయాలని అక్కడి వాసులు ముక్తకంఠంతో కోరుతున్నారు. మంచినీటిని సరఫరా చేయాలని విన్నవిస్తున్నారు.

## మొక్కలను రక్షిస్తున్న మందస ప్రజలు



**మందస, మార్చి 23(వార్త):** మందసలో గో గ్రీన్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. హరిత మందస లక్ష్యంగా ప్రొఫెసర్ పట్నాల మోహనాచారి మందస పట్టణవాసులు సహాయ, సహకారాలతో ఈ మొక్కలను నాటారు. పట్టణంలోని యువకులు, స్వచ్ఛంద సేవకులు, విద్యావంతులు, గ్రామపెద్దలు మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొడంతో పాటు వాటిని సంరక్షిస్తున్నారు. పశువుల బారిన పడకుండా ట్రీగార్డ్స్ పెట్టడం, ప్రతీ రోజూ నీరు పోయడం చేస్తున్నారు. హరిత మందస నిర్మాణానికి స్థానికుల సహకరిస్తున్న తీరు అభినందనీయం. ప్రజలంతా కలసికట్టుగా పని చేస్తే.. మందస అభివృద్ధి సాధ్యపడుతుందని భావిస్తున్నారు.

## సత్యసాయి సేవలు అమూల్యం



**కవిటి, మార్చి 23(వార్త):** రాజపురంలో గల శ్రీ సత్యసాయి సేవా సమితి సేవలు అమూల్యమని నిరుపేద బాధితులు కొనియాడారు. ప్రతినెల ఈ ప్రాంతంలో నాలుగు నిరుపేద కుటుంబాలకు నెల రోజులకు సరిపడే విధంగా నిత్యవసర సరుకులను అందిస్తూ పేదల అవసరాలు తీరుస్తున్న సత్యసాయి సేవా సమితి సేవలు వెలకట్టలేనివని పేర్కొన్నారు. ఇందులో భాగంగా మార్చి నెలకు సంబంధించి సోమవారం పలు కుటుంబాలకు నిత్యావసర సరుకులను అందజేశారు. కొత్తపాలెం గ్రామంలో బడే పొట్టమ్మ, కర్రివానిపాలెంలో సూర్ని నూకమ్మ, కొత్తకొజ్జిరియాలో గడగల కామేష్, ఇంటి వెనక పుట్టుకలో ఇంటర్ వరలక్ష్మిలకు సరుకులను అందజేశారు.

## గ్రామాల్లో రైతు మీకోసం ప్రచార యాత్ర



**ఇచ్ఛాపురం, మార్చి 23(వార్త):** సోంపేట వ్యవసాయ సహాయ సంచాలకులు టి.భవానీశంకరరావు ఆధ్వర్యంలో రైతు మీకోసం ప్రచార కార్యక్రమం తేలుకుంచి, కొటారి, తులసిగాం గ్రామాల్లో సోమవారం నిర్వహించారు. రైతులతో ప్రత్యక్షంగా సమావేశమై, వారి అవసరాలు, సమస్యలు, ఎరువుల, సాగు విధానాలు, పంటల నిర్వహణపై సమగ్రంగా చర్చించారు. ఇచ్ఛాపురం పీఏసీఎస్ కార్యాలయాన్ని సందర్శించి, ఎరువుల నిల్వలు, పంపిణీ విధానం, స్టాక్ రిజిస్టర్లు, విక్రయ వివరాలను సూక్ష్మంగా పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి అజయ్‌కుమార్, ఇన్‌చార్జిలు దీక్షిత్, మల్లేష్, సోనియా, గ్రామ సచివాలయ సిబ్బంది, పీఏసీఎస్ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## టి.బరంపురంలో వసంత నవరాత్రి ఉత్సవాలు



**ఇచ్ఛాపురం, మార్చి 23(వార్త):** టి.బరంపురంలోని సీతారామ ఆలయంలో వసంత నవరాత్రులు ఉగాది నుంచి శ్రీరామ నామము వరకు నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. పంచమి సందర్భంగా స్వామివారి మూలవిరాట్ విగ్రహాలకు పంచామృత అభిషేకాలు, ప్రత్యేక పూజలు, నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు లక్ష్మీదేవి దంపతుల యొక్క ఆధ్వర్యంలో భజన కార్యక్రమం మహతి సాంస్కృతిక కళాశాల సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సందర్భంగా ప్రముఖ సంగీత గాత్ర కళాకారులు చండిపుట్టుగా వాస్తవ్యులు దూట్ల వెంకటేశం కీ స్థానిక సర్పంచ్ కారింగి త్రినాథ్ రెడ్డి మహతి సాంస్కృతిక కళాసేవ సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పెద్దలు దక్కత మోహన్ రావు, ఎదురు కేదారి, కొయ్య రామ్మూర్తి, దూపన నూకరాజు, దూపాన నారాయణ, దక్కతా వాసు, దూపన లింగయ్య, కళాకారులు చలపరాయి వినోద్ కుమార్, మార్పు నారాయణ రావు, నర్తు గంగయ్య, బోర రామారావు, షణ్ముఖ రావు, కూర్మారావు తాతారావు, సంతు మాశాఖపురం, గుడ్డిపద్రా కళాకారిణి లు తదితరులు పాల్గొన్నారు.

## మత్స్యకార కుటుంబానికి అండగా ..

**ఇచ్ఛాపురం, మార్చి 23(వార్త):** ఈదుపురం గ్రామంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో ఇల్లు కోల్పోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న మత్స్యకారుడు కీర్తిచంద్ర బెహరా కుటుంబానికి గ్రామస్థులు అండగా నిలిచారు. కరెంట్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇల్లు పూర్తిగా దగ్ధమై, ఇంట్లో ఉన్న వస్తువులు అన్నీ బూడిద అయ్యాయి. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబానికి ఒక నెలపాటు భోజనం కోసం బియ్యం ప్యాకెట్‌తో పాటు అవసరమైన నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ సహాయ కార్యక్రమంలో హంగీర్ బెహరా ఆధ్వర్యంలో సరుకులను బాధిత కుటుంబానికి అందించారు. కార్యక్రమంలో విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ తిరుపతి రావు, మనోజ్ బెహరా, తిల్లోచన్న, కేశవ, తిట్టు గ్రామ మహిళలు పాల్గొన్నారు.



## ఊరటనిచ్చిన చిరుజల్లులు




**మందస, మార్చి 23(వార్త):** వేసవితాపంతో ఇబ్బందులకు గురవుతున్న ప్రజలకు చిరు జల్లులు ఊరటనిచ్చాయి. సుమారు నాలుగైదు నెలలుగా వర్షాల్లేక పోవడంతో రైతులు కూడా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఓ వైపు వాతావరణంలో మార్పులు, మరో వైపు రైతుల పంటలకు నీరు అవసరం కావడంతో వర్షానికై అన్నదాత ఆకాశం వైపు ఎదురు చూశారు. గత మూడు, నాలుగు రోజులుగా వరుణుడు రైతులకు ఊరిస్తునే ఉన్నారు. సోమవారం మాత్రం చిరుజల్లులను కురిపించి, ఊరటనిచ్చాడు. ఈ ప్రాంతంలో నీటి కొరత, ఎండవేడిమి, పంటలకు తెగుళ్లు సోకడంతో వర్షాలు అనివార్యమయ్యాయి. చిన్నపాటి వర్షం కురియడంతో వాతావరణం కొంత చల్లబడింది. పెద్ద వర్షం పడి ఉంటే పంటలకు మేలు కలిగి ఉండేదని రైతులు పేర్కొంటున్నారు.

## మోడల్ పాఠశాలలో ఎంఈఓల తనిఖీలు



**సారవకోట, మార్చి 23 (వార్త):** చోడ సముద్రం ప్రభుత్వ మోడల్ ప్రాథమిక పాఠశాలను ఎంఈఓలు మద్దు వెంకటరమణ, కోడి భూలక్ష్మి సోమవారం పరిశీలించారు. పాఠశాలకు చేరుకున్న వారు విద్యార్థులతో మాట్లాడి పలు ప్రశ్నలు వేసి వారి ప్రతిభను అంచనా వేశారు. జీఎఫ్ఎల్ఎన్ (Foundational Literacy and Numeracy) కార్యక్రమాన్ని ప్రతిరోజు క్రమం తప్పకుండా నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి, నిర్వహణపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ఆధార్ అప్‌డేషన్‌కు ప్రత్యేక శిబిరం



**నరసన్నపేట, మార్చి 23(వార్త):** నరసన్నపేట నేతాజీ వీధిలోని ఒక ప్రైవేటు పాఠశాలలో విద్యార్థుల ఆధార్ అప్‌డేషన్ ప్రక్రియను మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు మడపాం సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ ఎ. నాగజ్యోతి తెలిపారు. సోమవారం నుండి బుధవారం వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని పేర్కొన్నారు. విద్యార్థుల ఆధార్‌లో పుట్టిన తేదీ, పేర్లలో ఉన్న తప్పులను సవరించే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కేవైసీ ప్రక్రియను విద్యార్థులందరూ తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలని ఎంఈఓ ఉప్పాడ శాంతారావు విజ్ఞప్తి చేశారు.

## కేంద్రీయ విద్యాలయలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**శ్రీకాకుళం, మార్చి 23(వార్త):** స్థానిక పెద్దపాడు సమీపంలోని పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయంలో 2026-27 విద్యా సంవత్సరానికి గాను బాలవాటిక-3, ఒకటో తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విద్యాలయ ప్రిన్సిపాల్ షోయబ్ ఆలం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ఏప్రిల్ 2వ తేదీలోగా ఆన్‌లైన్ (https://admission.kvs.gov.in/) ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అలాగే 2 నుంచి 9వ తరగతి వరకు గల ఖాళీలకు ఏప్రిల్ 2 నుంచి 8వ తేదీ వరకు ఆఫ్‌లైన్ పద్ధతిలో దరఖాస్తులు సమర్పించవచ్చని, ఇతర వివరాలకు పాఠశాల వెబ్‌సైట్‌ను చూడాలని ఆయన పేర్కొన్నారు.

## శిథిలావస్థలో హడ్కో కాలనీ సామాజిక భవనం

**- పునర్నిర్మించాలని వార్డు సభ్యురాలి విజ్ఞప్తి**

**- ఆక్రమణ యత్నాలపై స్థానికుల ఆందోళన**

**నరసన్నపేట, మార్చి 23 (వార్త):** నరసన్నపేట మండల కేంద్రంలోని హడ్కో కాలనీలో ఉన్న సామాజిక భవనం శిథిలావస్థకు చేరుకుందని స్థానిక వార్డు సభ్యురాలు సంతోషి తెలిపారు. ఒకప్పుడు ఈ భవనాన్ని కాలనీవాసులు శుభకార్యాలు, సామాజిక కార్యక్రమాలకు వినియోగించుకునేవారని, ప్రస్తుతం పాడవడంతో ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించడం లేదని ఆమె పేర్కొన్నారు. భవనం దెబ్బతినడంతో కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ భవనాన్ని పునర్నిర్మించి మళ్లీ వినియోగంలోకి తీసుకురావాలని ఆమె కోరారు. అదేవిధంగా ఈ విలువైన స్థలాన్ని కొందరు ఆక్రమించుకునేందుకు యత్నించగా స్థానికులు అడ్డుకున్నారని వెల్లడించారు. ఈ విషయంపై ప్రభుత్వం తక్షణమే దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సామాజిక భవనాన్ని పునర్నిర్మించాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.



## దాబాలు నిర్ణీత సమయంలోగా మూసివేయాలి

**-రాత్రి 11 గంటల తర్వాత టిఫిన్,**

**స్ట్రీట్ ఫుడ్ దుకాణాలకు అనుమతి లేదు**

**-అనవసరంగా రాత్రి వేళల్లో సంచరించరాదు**

**-కాశీబుగ్గ ఇన్‌చార్జి డీఎస్పీ డి.లక్ష్మణరావు**

**పలాస, మార్చి 23 (వార్త):** జిల్లాలో శాంతి భద్రతలను మరింత బలోపేతం చేయడం దృష్ట్యా, రాత్రి వేళల్లో అనవసర గుంపులు, అశాంతి పరిస్థితులు, నేరాలకు దారితీసే అవకాశాలను నివారించేందుకు ధాబాల నిర్వహణపై కాశీబుగ్గ సబ్ డివిజన్ ఇంచార్జి డీఎస్పీ డి లక్ష్మణరావు సోమవారం ఒక ప్రకటన జారీ చేశారు. కాశీబుగ్గ సబ్ డివిజన్ పరిధిలోని అన్ని ధాబాల యజమానులు ప్రతిరోజూ రాత్రి 11:00 గంటల లోపు తమ ధాబాలను తప్పనిసరిగా మూసివేయాలని, అనుమతి లేకుండా రాత్రి ఆలస్యంగా ధాబాలను నిర్వహించడం, కస్టమర్లను అనుమతించడం చట్టపరమైన చర్యలకు గురికావచ్చు. రాత్రి 11 గంటల తర్వాత టిఫిన్ సెంటర్లు, స్ట్రీట్ ఫుడ్ దుకాణాలు తెరిచి ఉంచరాదని, ప్రతిరోజు తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.



అదేవిధంగా, రాత్రి 11 గంటల తర్వాత ఎటువంటి అత్యవసర కారణం లేకుండా ప్రజలు అనవసరంగా సంచరించరాదు. రాత్రి వేళల్లో సినిమాలకు వెళ్లిన వ్యక్తులు తిరుగు ప్రయాణంలో సినిమా టికెట్‌ను తప్పనిసరిగా కలిగి ఉండాలని, దాబాల వద్ద మద్యం క్రయ విక్రయాలు, సేవించడం, మాదక ద్రవ్యాల వినియోగం, అనవసర గుంపులు చేరడం, శబ్ద కాలుష్యం సృష్టించడం వంటి కార్యకలాపాలను కఠినంగా నిషేధించడమైనదని, దాబాల యజమానులు తమ ప్రాంగణంలో ఇలాంటి అక్రమ చర్యలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి, సిబ్బంది వివరాలను నమోదు చేయాలన్నారు. అనుమానాస్పద వ్యక్తులపై వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని ఆదేశాలను ఉల్లంఘించిన పక్షంలో సంబంధిత యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని డీఎస్పీ లక్ష్మణ రావు హెచ్చరించారు.

## సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటమే ..

# భగత్‌సింగ్‌కి అర్పించే నిజమైన నివాళి

**పలాస, మార్చి 23 (వార్త):** సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటమే భగత్ సింగ్‌కి అర్పించే నిజమైన నివాళని పలు ప్రజా సంఘ నాయకులు పేర్కొన్నారు. పలాస ఉద్దానంలోని మామిడిపల్లి, నీలావతిలో భగత్సింగ్ విగ్రహాల వద్ద సోమవారం ప్రజాసంఘాల ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా జరిగిన నివాళి కార్యక్రమాల్లో అఖిలభారత రైతుకూలీ సంఘం ఏఐకేఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వంకల మాధవరావు, ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్యు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. వినోద్ కుమార్ , ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు గౌరకల బాలకృష్ణ, ఐ ఎఫ్ టి యు జిల్లా నాయకులు జు వీరాస్వామి, ప్రగతిశీల మహిళా సంఘం పిఓడబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు బతకల ఈశ్వరమ్మ , జిల్లా ప్రధాన కార్యదర్శి పోతనపల్లి కుసుమ, పి కే ఎస్ జిల్లా నాయకులు దుర్యోధన, పి వై ఎల్ జిల్లా కన్వీనర్ సార జగన్, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు వంకల పాపయ్య, పలు ప్రజా ప్రజా సంఘాల నుంచి జడే అప్పయ్య, సార సోమేశ్ , వంకల ఢిల్లీశ్వరి, సార నూకయ్య, నర్తు దినేష్ తదితరులు భగత్సింగ్ విగ్రహానికి నివాళులర్పించిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా మామిడిపల్లి గ్రామంలో జరిగిన నివాళి కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వంకల మాధవరావు మాట్లాడుతూ భగత్సింగ్ ను స్మరించుకోవడం అంటే సామ్రాజవాదానికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు . ఈరోజు అమెరికా ఇజ్రాయిల్ సామ్రాజవాదులు ఇరాన్నైన వెనిజులా వంటి అనేక మూడో ప్రపంచ దేశాలపైన దాడులు చేస్తూ సామ్రాజ్యవాద విస్తరణలో భాగంగా సహజ వనరులను, ఆయిల్ సంపదను కొల్లగొట్టడానికి సామ్రాజవాదం దూకుడుగా యుద్ధాలు చేస్తుంది. ఈ యుద్ధం ప్రభావంతో పీడిత దేశాలైన మూడో ప్రపంచ దేశాల ప్రజలపైన అనేక రకాల భారాలు పడుతున్నాయి. అమెరికాలో ఉన్న ఆయుధ సంపత్తిని అమ్ముకుంటున్నాయి. ఈ నేపథ్యంలో భగత్ సింగ్ లాంటి అమరులను స్ఫూర్తిగా తీసుకొని పోరాడాలన్నారు. అమెరికా భారత్ వాణిజ్య ఒప్పందంతో ఇక్కడ రైతాంగం మెడకు ఉరుతాడు బిగించే ప్రమాదం ఉంది. భారత రైతాంగం విద్యార్థులు యువకులు ఐక్యంగా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడాలని వంకల మాధవరావు పిలుపునిచ్చారు. భారత్ అమెరికా వాణిజ్య ఒప్పందం తక్షణమే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు .



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## అణగారిన వర్గాల విద్యా ప్రదాత దొమ్మేటి వెంకటరెడ్డి

### -కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

**శ్రీకాకుళం, మార్చి 23(వార్త):** వెనుకబడిన తరగతుల అభ్యున్నతికి, ముఖ్యంగా శెట్టిబలిజ సామాజిక వర్గ విద్యా వికాసానికి దొమ్మేటి వెంకటరెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన దొమ్మేటి వెంకటరెడ్డి 173వ జయంతి మహోత్సవంలో ఆయన వెంకటరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. 18వ శతాబ్దంలో సమాజంలో నెలకొన్న అంటరానితనం, నిరక్షరాస్యతను రూపుమాపేందుకు వెంకటరెడ్డి ఎంతో కృషి చేశారని గుర్తుచేశారు. కష్టపడే తత్వం, సామాజిక స్పృహ ఉన్న వెంకటరెడ్డి వంటి మహనీయుల జీవిత చరిత్ర నేటి యువతకు స్ఫూర్తిదాయకమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎస్వీ లక్ష్మణమూర్తి, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారిని అనురాధ, బీసీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.




## విద్యార్థుల అడ్మిషన్లకు స్పెషల్ డ్రైవ్



**నరసన్నపేట, మార్చి 23(వార్త):** సత్యవరంలో విద్యార్థుల అడ్మిషన్ల కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్లు ఎంఈఓ ఉప్పాడ శాంతారావు తెలిపారు. సోమవారం పాఠశాల హెచ్ఎం అప్పలనాయుడు, ఉపాధ్యాయులతో కలిసి గ్రామంలో పర్యటించి తల్లిదండ్రులతో మాట్లాడారు. 'మన ఊరు బడిని కాపాడుకుందాం' కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన బోధన అందిస్తున్నామని, అందుబాటులో ఉన్న సౌకర్యాలను వినియోగించుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పశువులకు ఉచిత టీకాలు.. రైతులకు అవగాహన



**జలుమూరు, మార్చి 23 (వార్త):** రాష్ట్ర పశుసంవర్ధక శాఖ ఆదేశాల మేరకు పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణకు ఉచిత టీకాలు అందజేస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ వైద్యాధికారి ఎం. ఫ్రెడరిక్ తెలిపారు. సోమవారం జలుమూరు మండలం తిమడాం పంచాయతీలో నిర్వహించిన కార్యక్రమంలో పాడి రైతులకు టీకాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ టీకాలు పూర్తిగా ఉచితంగా అందిస్తున్నందున రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పశువుల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న ఈ చర్యలను రైతులు ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పాడి రైతులు, శాఖ సిబ్బంది పాల్గొన్నారు.


## మారుతినగర్‌లో పారిశుధ్య పనులు



**నరసన్నపేట, మార్చి 23 (వార్త):** నరసన్నపేట మారుతి నగర్ 1వ వీధిలో పారిశుధ్య పనులను గ్రామపంచాయతీ సిబ్బంది సోమవారం ఉదయం చేపట్టారు. మురుగునీరు నిలిచి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారన్న ఫిర్యాదుల మేరకు ఈవో ద్రాక్షాయిణి స్పందించారు. ఈ సందర్భంగా మురుగునీరు నిలిచిన ప్రాంతాలను శుభ్రం చేయించి, రోడ్లపై నిలిచి ఉన్న మురుగునీటిని తొలగించారు. దీంతో స్థానికులకు కొంత ఉపశమనం కలిగింది. అయితే కాలువలను క్రమం తప్పకుండా, కనీసం వారానికి ఒక్కసారైనా శుభ్రపరచాలని, నిలిచిన వ్యర్థాలను తొలగించాలని స్థానికులు, వీధివాసులు అధికారులను విజ్ఞప్తి చేశారు.

## నరసన్నపేట ఎక్సైజ్ సీఐగా..

## వెంకటప్పలనాయుడు బాధ్యతల స్వీకరణ



**నరసన్నపేట, మార్చి 23 (వార్త):** నరసన్నపేట ఎక్సైజ్ సీఐగా వెంకట అప్పలనాయుడు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. విశాఖపట్నం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చిన ఆయన, తన పరిధిలో అక్రమ మద్యం విక్రయాలు, రవాణాపై ఎలాంటి సడలింపులు ఉండవని స్పష్టం చేశారు. నరసన్నపేట, పోలాకి మండలాల్లో అక్రమంగా మద్యం విక్రయాలు లేదా రవాణా చేపడితే కఠినంగా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలను అరికట్టేందుకు ప్రత్యేక బృందాలతో నిరంతర తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. అక్రమ రవాణాను పూర్తిగా నిర్మూలించేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తప్పవని, ప్రజలు కూడా సమాచారం అందిస్తూ సహకరించాలని అప్పలనాయుడు విజ్ఞప్తి చేశారు.

## నేడు ఎస్.సి కమిషన్ సభ్యుడి రాక

**శ్రీకాకుళం, మార్చి 23(వార్త):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు రావాడ సీతారాం ఈ నెల 24వ తేదీ మంగళవారం శ్రీకాకుళం జిల్లాలో పర్యటించనున్నట్లు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పర్యటనలో భాగంగా ఉదయం 10:30 గంటల నుండి జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఎస్సీ సామాజిక వర్గ ప్రజలు, వివిధ సంఘాల నుండి వినతులు, ఫిర్యాదులను స్వీకరిస్తారని పేర్కొన్నారు. అనంతరం మధ్యాహ్నం మున్సిపల్ అధికారులతో సమావేశమై, సాయంత్రం ఎస్సీ సంక్షేమ హాస్టళ్లు, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలను సందర్శిస్తారని కలెక్టర్ పేర్కొన్నారు.

## ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాలకు నాలుగు రోజుల పాటు నీటి సరఫరా బంద్

**శ్రీకాకుళం, మార్చి 23(వార్త):** జిల్లాలోని ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల ప్రజలకు రానున్న నాలుగు రోజుల పాటు మంచినీటి సరఫరాలో అంతరాయం కలగనుందని గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య విభాగం పర్యవేక్షక ఇంజనీరు పి.శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. హిరమండలం సమీపంలో ఎత్తి పోతల పథకం పనులు జరుగుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. పనుల్లో భాగంగా 3 మీటర్ల డయా కలిగిన భారీ పైపులను అమర్చుతున్నారు. అయితే, అదే అండర్ పాస్ మార్గంలో ప్రధాన తాగునీటి సరఫరాకు సంబంధించి 1000 ఎం.ఎం. డయా కలిగిన ఎం.ఎస్. పైప్‌లైన్ మీదుగా వెళ్తోంది. ఈ సాగునీటి పైపులను క్రాస్ చేసే పనుల దృష్ట్యా, ఇంజనీరింగ్ అధికారుల విజ్ఞప్తి మేరకు తాత్కాలికంగా నీటి సరఫరాను నిలిపివేశారు. ఈ క్లిష్టమైన పనులు పూర్తి కావడానికి సుమారు నాలుగు రోజుల సమయం పడుతుందని లిఫ్ట్ ఇరిగేషన్ అధికారులు వెల్లడించారు. పనులు పూర్తయిన వెంటనే యుద్ధ ప్రాతిపదికన మంచినీటి సరఫరాను పునరుద్ధరిస్తామని ఎస్ఈ తెలిపారు. ఈ అనివార్య కారణాల వల్ల కలిగే ఇబ్బందిని దృష్టిలో ఉంచుకుని అధికారులకు ఆయా నియోజకవర్గాల ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

# పచ్చని భూములను కార్గో ఎయిర్‌పోర్టుకు ఇవ్వం

### -ఉద్దానంలో బాధిత రైతుల నల్ల రిబ్బన్ల నిరసన



**మందస, మార్చి 23(వార్త):** పచ్చని ఉద్దాన భూములను కార్గో ఎయిర్ పోర్టు నిర్మాణానికి ఒక్క సెంటు భూమి కూడా ఇవ్వమని ఉద్దానంలోని రైతులు అన్నారు. మందస మండలంలోని రాంపురం పంచాయతీలో గల బిడిమి గ్రామంలో బాధిత రైతులు సోమవారం నల్ల రిబ్బన్లతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కార్గో ఎయిర్ పోర్ట్ వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షులుడు కొమర వాసు మాట్లాడుతూ కార్గో ఎయిర్ పోర్ట్ కి సెంటు భూమి కూడా ఇచ్చేది లేదన్నారు. ఈ నెల 23 నుంచి 31వ తేదీ వరకు నల్ల రిబ్బన్లుతో నిరసన కార్యక్రమం పిలుపు మేరకు బిడిమి గ్రామంలోని బాధిత రైతులతో సమావేశం ఏర్పాటు చేసి నల్ల రిబ్బన్లుతో ప్రభుత్వం పై నిరసన తెలిపారు. కార్గో ఎయిర్ పోర్ట్ బాధిత రైతు దున్న హరికృష్ణ మాట్లాడుతూ గత 18 నెలలు నుంచి కార్గో ఎయిర్ పోర్ట్ వ్యతిరేక పోరాట కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు ప్రతీ కార్యక్రమం కూడా తూచా తప్పకుండ నిర్వహించడం జరుగుతోందన్నారు. బిడిమి గ్రామంలో ఉన్న బాధిత రైతులందరు కూడా అధికారులు ఏర్పాటు చేసిన రెండు మూడు సమావేశంలో ముక్తకంఠంతో ఒక్క అంగుళం భూమి కూడా ఇవ్వలేమని చెప్పారన్నారు. మళ్ళీ నల్ల రిబ్బన్లుతో నిరసన చేస్తూ ప్రభుత్వంకి, స్థానిక ప్రజాప్రతినిధులకి అదే గొంతు వినిపిస్తున్నామన్నారు. పచ్చని పంట పొలాల్లో కార్గో ఎయిర్ పోర్ట్ నిర్మాణం చేపట్టొద్దని, మా జీవన భృతికి అన్యాయం చెయ్యొద్దని కోరుకుంటున్నామన్నారు. అవసరమైతే ప్రాణాలు ఇస్తాం.. కానీ మా జీనాధారమైన భూమిని వదులుకోలేమని గుర్తు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పొట్టి ధర్మారావు, కార్గో ఎయిర్ పోర్ట్ వ్యతిరేక పోరాట కమిటీ ఉపాధ్యక్షుడు లండ రామస్వామి, ప్రధాన కార్యదర్శి జోగి అప్పారావు, మీడియా వింగ్ కన్వీనర్ బత్తిని లక్ష్మణ్, నల్ల పరుశురాం,గుంటు రామస్వామి, జుత్తు ధర్మారావు, సుంకర రాజు, మర్ల ఉపేంద్రావు, ఇరోతు కృష్ణారావు, తెప్పల రామారావు, సొర మహాలక్ష్మి, మెట్టూరు నాగరత్నం, ఈరోతు ప్రభ, తిమ్మల రాములమ్మ, చెల్లూరి పార్వతి, దున్న గుణ సుందరి, తెప్పల దానమ్మ, రత్నాల సావిత్రమ్మ, జుత్తు మీన, పుచ్చ పార్వతి, మర్ల అప్పన్న, పసుపురెడ్డి ఈశ్వరరావు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

### బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడి ..

# ఉరి కంబాన్ని ముద్దాడిన భగత్‌సింగ్





**పలాస, మార్చి 23 (వార్త):** బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడి ఉరికంబాన్ని ముద్దాడిన భారత విప్లవ నేత భగత్ సింగ్, రాజగురు, సుఖదేవులని విరసం రాష్ట్ర కార్యదర్శి రివేరా పేర్కొన్నారు. సోమవారం 95వ సంస్మరణ సభను పిడియం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విరసం రాష్ట్ర కార్యదర్శి రివేరా మాట్లాడుతూ కామ్రేడ్స్ భగత్ సింగ్ రాజుగురు సుఖ దీవులు 95 ఏళ్ల క్రితం దేశ స్వాతంత్రం కోసం రాజీలేని సాయుధ పోరాట మార్గాన్ని ఎంచుకొని తమ జీవితాలను దేశ విముక్తి కోసం అర్పించారని, అతి చిన్న వయసులోనే చిరునవ్వుతో ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన మహావీరులు, వీరి స్ఫూర్తిని మనం కొనసాగించాల్సిన అవసరం ఉన్నదని చెప్పారు. అమరులు కోరుకున్న దోపిడీ పీడన లేని సమ సమాజ నిర్మాణాన్ని ఈ దేశంలో నిర్మించడం ద్వారా వారి ఆశయం పరిపూర్తి అవుతుందని, ఆ వైపు పయనించడమే వారికి మనమిచ్చే నిజమైన నివ్వాలని ఆయన అన్నారు. పిడియం రాష్ట్ర నాయకులు పై వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అమెరికన్ సామ్రాజ్యవాదం ఇరాన్ పై చేస్తున్న దాడులను ఖండించాలని, కామ్రేడ్ భగత్ సింగ్ సామ్రాజ్యవాదం అంటేనే యుద్ధమని ఆయన ఆనాడే అన్నాడని, భారత పాలకులు సామ్రాజవాదులతో కుమ్మక్కై దేశ వనరులను దోచుకునేందుకు ప్రయత్నిస్తున్నారని, కామ్రేడ్ భగత్ సింగ్ స్ఫూర్తితో నిజమైన స్వేచ్ఛ స్వాతంత్రాల కోసం ఉద్యమించాలన్నారు. ఈ సభకు అధ్యక్షత వహించిన ఎస్ వీరాస్వామి పిడియం రాష్ట్ర కమిటీ సభ్యులు భగత్ సింగ్ రాజుగురు సుఖదేవులు దేశం కోసం చేసిన కృషిని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో పిడియం రాష్ట్ర అధ్యక్షులు జే వెంకట్రావు, సిఎల్పి రాష్ట్ర సహాయ,కార్యదర్శి పత్రి ధానేష్, పి కే ఎస్ జిల్లా కార్యదర్శి దుర్యోధన, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు, ఏబిఎంఎస్ జిల్లా అధ్యక్షులు కోదండం, కార్గో ఎయిర్పోర్ట్ వ్యతిరేక కమిటి కన్వీనర్ కె వాసు, డిటిఎఫ్ ధర్మారావు, అరసం కృష్ణ, ఆంధ్రప్రదేశ్ జీడి పిక్కల రైతాంగ పోరాట కమిటీ టి. అజయ్ కుమార్, స్వేచ్ఛ మహిళా సంఘం నాగమణి, పీకేఎస్ కళాకారులు ఈశ్వరరావు, గణపతి, పిడియం కళాకారులు గంగయ్య, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇరుకు వీధుల్లో భారీ వాహనాల రాకతో ఇబ్బందులు

### -బజారు వీధుల్లో ట్రాఫిక్ సమస్య తీవ్రం

### - భారీ వాహనాలపై ఆంక్షలు

### విధించాలని స్థానికుల డిమాండ్



**నరసన్నపేట, మార్చి 23 (వార్త):** నరసన్నపేట పట్టణంలోని బజారు వీధులు చాలా ఇరుకుగా ఉండటంతో స్థానికులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ ఇరుకు రహదారుల్లో భారీ వాహనాలు ప్రవేశించడం పరిస్థితిని మరింత క్లిష్టంగా మార్చుతోంది. రోజూ భారీ లారీలు వీధుల్లోకి రావడంతో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారి వెడల్పు తక్కువగా ఉండటంతో ట్రాఫిక్ రద్దీ పెరిగి ప్రమాదాల భయం నెలకొంది. ప్రత్యేకంగా రద్దీ సమయాల్లో పరిస్థితి మరింత విషమంగా మారుతోందని, చిన్నపాటి ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వారు తెలిపారు. ఈ నేపథ్యంలో ఇరుకు వీధుల్లో భారీ వాహనాల రాకను నియంత్రించేందుకు అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# గెలుపే టీడీపీ లక్ష్యం కావాలి

### -స్థానిక పంచాయతీ ఎన్నికలే ఎజెండా

### - కలిసికట్టుగా పనిచేయాలని పిలుపు

### -ఎమ్మెల్యే గౌతు శిరీష, సమన్వయకర్త వెంకన్న చౌదరి ఆదేశాలతో మందస మండల పార్టీ కార్యాలయంలో

### కీలక సమావేశంలో నిర్ణయం

**మందస, మార్చి 23(వార్త):** రాబోయే స్థానిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ శ్రేణులు పని చేయాలని తెలుగుదేశం పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. మందస పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో క్లస్టర్, యూనిట్, బూత్ కన్వీనర్లు, కో-కన్వీనర్ల తో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ ఎమ్మెల్యే గౌతు శిరీష నిర్దేశం మేరకు, ప్రతి నాయకుడు, కార్యకర్త బూత్‌ల వారీగా పనిచేయాలని పిలుపునిచ్చారు. మన పార్టీకి దూరంగా ఉన్న వారిని గుర్తించి, గత ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ, వారిని మన వైపు మొగ్గు చూపేలా చేయాలని కోరారె. ప్రతి ఇంటి తలుపు తట్టి, ప్రజల సమస్యలు తెలుసుకుని, వారికి అండగా నిలవాలని, ఆయన సూచించారు. మనం అభివృద్ధి చెయ్యాల్సిన పనులు త్వరగా కంప్లీట్ చేసి, ఇంకా అందాల్సిన సంక్షేమ అభివృద్ధి పథకాలు, కొన్ని అందని ప్రత్యేక పంచాయతీలు, గ్రామాలు గుర్తించి, వారికి కూడా అన్ని సంక్షేమ పథకాలు చేకూరేలా చెయ్యాలని పిలునిచ్చారు. మై టీడీపీ యాప్ డౌన్లోడ్ చేసి మనం చేసిన ప్రతి ప్రోగ్రాం అందులో అప్లోడ్ చెయ్యాలని చెప్పారు. రానున్న ఎన్నికల్లో గెలుపునకు ఈ సమావేశం అత్యంత కీలకమని ప్రాధాన్యతనిచ్చారు. పాల్గొన్న నాయకులు ఈ వ్యూహాన్ని క్షేత్రస్థాయిలో ఎలా అమలు చేయాలనే దానిపై విస్తృతంగా చర్చించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బావన దుర్యోధన, మండల కార్యదర్శి సాలిన మాధవరావు, క్లస్టర్-5 ఇంచార్జి కొర్ల కన్నారావు, కోఇంచార్జి బేసి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



## హరిపురం దొంగతనం కేసులో ఒకరి అరెస్టు

### -20 గ్రాముల బంగారం రికవరీ




**మందస, మార్చి 23(వార్త):** హరిపురంలో జరిగిన దొంగతనం కేసులో మందస పోలీసులు ఒకరిని అరెస్ట్ చేశారు. మందస ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మందస మండలం హరిపురం పెద్ద వీధిలో ఈనెల 13న పొట్టి శాంతి అనే మహిళ ఇంట్లో 20 గ్రాముల బంగారం చోరీ జరిగింది. చోరీ కేసును మందస పోలీసులు చాకచక్యంగా ఛేదించారు. హరిపురంలోని స్వీట్ దుకాణంలో పొట్టి శాంతితో పాటు వంట పనులు నిర్వహిస్తున్న ఒడిషాకు చెందిన ఉమాకాంత్ బిశ్వాల్ అనే వ్యక్తి ఈ చోరీకి పాల్పడినట్టు పోలీసులు గుర్తించారు. సంబంధిత వివరాలను కాశీబుగ్గరూరల్ సీఐ ఎం.తిరుపతిరావు, మందస ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ సోమవారం మీడియాకు వెల్లడించారు. 20 గ్రాముల బంగారం రికవరీ చేసి, చోరీకి పాల్పడిన ఉమాకాంత్ బిశ్వాల్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు.

## వైభవంగా శ్రీరామనవమి ఉత్సవాలు

### - కోదండరామ ఆలయంలో ఘనంగా ఏర్పాట్లు



**సోంపేట, మార్చి 23(వార్త):** సోంపేటలోని శ్రీ కోదండరామ ఆలయంలో ఈనెల 26 నుంచి జరగనున్న శ్రీరామనవమి ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ నిర్ణయించింది. మాజీ మంత్రి గౌతు శ్యామసుందర శివాజీ ముఖ్యఅతిథిగా సోమవారం సాయంత్రం ఆలయ ఆవరణలో ఉత్సవాలపై సమావేశం నిర్వహించారు. తొమ్మిది రోజులు పాటు జరిగే ఈ ఉత్సవాలకు సంబంధించి ఆలయం ముస్తాబు స్వామివారి అలంకరణ పూజా కార్యక్రమాలు తీర్థప్రసాదాలు అన్న ప్రసాద వితరణ భక్తుల సౌకర్యాలు మొదలైన వాటి గూర్చి చర్చించారు. ఎటువంటి లోటుపాట్లు లేకుండా భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తూ ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలు గూర్చి విస్తృతంగా చర్చించారు. ఆలయ ట్రస్ట్ కమిటీ అధ్యక్షుడు బీన ఆనందరావు కమిటీ సభ్యులు చిత్రాట శేఖర్ పొందూరు రాజు మద్దు రాజారావు దున్న జోగారావు బీన ఈశ్వరరావు కాంచన రాఘవ దాసు తదితరులు పాల్గొన్నారు.

## కొర్లాం నుంచి హరిపురం వరకు !

### -వైద్యం కోసం రాత్రిపూట వెళ్లిన బాధితుడు

### - కొర్లం పీహెచ్‌సీ సిబ్బంది నిర్లక్ష్యం



**సోంపేట, మార్చి 23(వార్త):** సోంపేట మండలం కొర్లాం గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా అదే గ్రామానికి చెందిన విషపు పురుగు కాటుకు గురైన దున్న కృష్ణారావు అనే రైతు ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో మందస మండలం హరిపురం ప్రభుత్వాసుపత్రికి వెళ్ళక తప్పలేదు. వివరాల్లోకి వెళితే తన పొలంలో చోడి పంట కాపలాకు రాత్రి వేళలో వెళ్లిన కృష్ణారావుకు పొలంలో విషపు పురుగు కాటేసింది. నొప్పి భరించలేక వెంటనే మిత్రుల సహాయంతో సోంపేటలోని ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లారు. అక్కడ సిబ్బంది ముందుగా ప్రభుత్వాసుపత్రికి వెళ్లాలని సూచించగా అర్థం చేసుకోలేని వీరు తిరిగి సోంపేట నుంచి స్వగ్రామం కొర్లంలో గల వైద్య ఆరోగ్య కేంద్రానికి వెళ్లారు. 24 గంటలు సేవలందించాల్సిన వైద్య కేంద్రంలో సిబ్బంది రాత్రివేళ వచ్చిన బాధితులు ఎంతగా తలుపులు కొట్టినా కూడా స్పందించలేదు. గత్యంతరం లేక సుమారు పది కిలోమీటర్ల దూరంలో మందస మండలం హరిపురం సామాజిక ఆసుపత్రికి వెళ్లి ప్రథమ చికిత్సను పొందినట్లు తెలిపారు. 24 గంటలు సేవలందించాల్సిన ఆసుపత్రిలో ఎంతటి నిర్లక్ష్యం నేలకొనడంపై గ్రామస్తులు తీవ్రంగా విమర్శిస్తున్నారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## పంచాయతీలకు చెత్త సేకరణ తొట్టెలు

**- మండల కార్యాలయానికి చేరిన 34**

**- త్వరలో పంపిణీ**

**నరసన్నపేట, మార్చి 23 (వార్త):** స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పంచాయతీలకు అందించాల్సిన చెత్త సేకరణ తొట్టెలు నరసన్నపేట మండలానికి చేరుకున్నాయని ఎంపీడీవో కె.వి. ప్రసాద్ రావు తెలిపారు. శనివారం ఉదయం జిల్లా కేంద్రం నుంచి మండల పరిషత్ కార్యాలయానికి 34 తొట్టెలు వచ్చినట్లు వెల్లడించారు. ఈ తొట్టెలను త్వరలోనే మండలంలోని పంచాయతీలకు పంపిణీ చేసేందుకు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో పరిశుభ్రతను మెరుగుపరచడంలో ఈ తొట్టెలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. తొట్టెల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో పరిశుభ్రతపై అవగాహన పెంపొందించడమే లక్ష్యమని అధికారులు తెలిపారు.



## అర్జీల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

**-149 అర్జీల స్వీకరణ**



**శ్రీకాకుళం, మార్చి 23(వార్త):** అర్జీల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ట్రైనీ కలెక్టర్ పృథ్వీ రాజ్ కుమార్ అధికారులను ఆదేశించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదికలో 149 అర్జీలు స్వీకరించారు. ప్రధానంగా రెవెన్యూ శాఖ 30, పంచాయతీ రాజ్ 17, వ్యవసాయ శాఖ 16, పేదరిక నిర్మూలన సంస్థ 13, మున్సిపల్ కార్పొరేషన్ 11, ఎపిఈపీడిసియల్ 11, సర్వే 9, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ 5, రూరల్ డెవలప్‌మెంట్ 5, అటవీ శాఖ 2, ఆర్డబ్ల్యుఎస్ 5 ఒ ఆయా శాఖలకు సంబంధించి 149 అర్జీలు స్వీకరించారు. అర్జీలు స్వీకరించిన వారిలో డిప్యూటీ కలెక్టర్లు పద్మావతి, జి.జయదేవి, తదితరులు పాల్గొన్నారు.

## పారిశ్రామికవాడలో జనసేన సభ్యత్వ నమోదు




**పలాస, మార్చి 23 (వార్త):** జనసేనపార్టీ పారిశ్రామిక ప్రాంతాల్లోని కార్మికులు, యువతను ఆకర్షించేలా, సామాజిక మార్పు కోసం ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టింది. పలాస నియోజకవర్గానికి చెందిన జనసేన కుటుంబ సభ్యులు దశాబ్దాల క్రితం పటాన్‌చెరు పారిశ్రామికవాడలో స్థిరపడి ఉపాధి పొందుతున్నారు. పలాస జనసేన పార్టీ ఇంచార్జి డాక్టర్ దుర్గారావు పారిశ్రామిక ప్రాంతంలో చేపట్టిన జనసేన ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో కార్మికులు, యువత పాల్గొని సభ్యత్వాన్ని నమోదు చేసుకున్నారు. ప్రజల్లో విశేష స్పందన వస్తుందని దుర్గారావు అన్నారు. జనసేన ఉద్యమి సభ్యత్వంలో అత్యంత ముఖ్యమైన అంశం బీమా రక్షణ. సేవా కార్యక్రమాల్లో పాల్గొనే కార్యకర్తలకు అనుకోని ప్రమాదాలు జరిగితే వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా ఇవ్వాలని పార్టీ నిర్ణయించిందని ఆయన చెప్పారు. జనసేన కార్యకర్తల సంక్షేమాన్ని కేవలం మాటల్లోనే కాదు, చర్యల్లో కూడా చూపించిందని, ఇప్పటివరకు ప్రమాదాల్లో మరణించిన కార్యకర్తల కుటుంబాలకు, గాయపడిన కార్యకర్తలకు పెద్ద మొత్తంలో ఆర్థిక సహాయం అందించిందని వివరించారు.

## రాత్రి 10 గంటల వరకే దాబాలకు అనుమతి

**సోంపేట, మార్చి 23(వార్త):** సోంపేట, కంచిలి మండలాల పరిధిలో శాంతి భద్రతలను మరింత బలోపేతం చేయడం దృష్ట్యా, నేరాలను అరికట్టేందుకు గాను, రాత్రి వేళల్లో అనవసర గుంపులు, అశాంతి పరిస్థితులు, నేరాలకు దారితీసే అవకాశాలను నివారించేందుకు ధాబాల నిర్వాహకులకు సోంపేట సీఐ బి. మంగరాజు సోమవారం ఒక ప్రకటన జారీ చేశారు. ఈ మండలాల పరిధిలోని అన్ని దాబాల యజమానులు ప్రతిరోజూ రాత్రి 10:00 గంటలకు తప్పనిసరిగా మూసివేయాలి. అనుమతి లేకుండా రాత్రి ఆలస్యంగా ధాబాలను నిర్వహించడం, కస్టమర్లను అనుమతించడం చట్టపరమైన చర్యలకు గురికావచ్చు.రాత్రి 10 గంటల తర్వాత టిఫిన్ సెంటర్లు, స్ట్రీట్ ఫుడ్ దుకాణాలు తెరిచి ఉంచరాదని,ప్రతిరోజు తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.. అదేవిధంగా, రాత్రి 10 గంటల తర్వాత ఎటువంటి అత్యవసర కారణం లేకుండా ప్రజలు అనవసరంగా సంచరించరాదు. రాత్రి వేళల్లో సినిమాలకు వెళ్లిన వ్యక్తులు తిరుగు ప్రయాణంలో సరైన గుర్తింపు కార్డు మరియు సినిమా టికెట్ లాంటివి తప్పనిసరిగా కలిగి ఉండాలి.ధాబాల వద్ద మద్యం క్రయ విక్రయాలు,సేవించడం, మాదక ద్రవ్యాల వినియోగం, అనవసర గుంపులు చేరడం, శబ్ద కాలుష్యం సృష్టించడం వంటి కార్యకలాపాలను కఠినంగా నిషేధించడమైనది. ధాబాల యజమానులు తమ ప్రాంగణంలో ఇలాంటి అక్రమ చర్యలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. అదేవిధంగా,సీసీ కెమెరాలు తప్పని సరిగా ఏర్పాటు చేయాలి. అనుమానాస్పద వ్యక్తులపై వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని,ఆదేశాలను ఉల్లంఘించిన పక్షంలో సంబంధిత యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందనిసీఐ తెలియజేశారు.

## జై భారత్..జయహో మోదీజీ

**పలాస, మార్చి 23 (వార్త):** భారత దేశ చరిత్రలో అత్యధిక కాలం ప్రభుత్వ అధిపతిగా పదవిలో కొనసాగిన మహనీయులు భారతదేశ గౌరవ ప్రధాని నరేంద్ర మోడీ అని భారతీయ జనతా పార్టీ శ్రీకాకుళం జిల్లా ఉపాధ్యక్షులు పాలవలస వైకుంఠ రావు అన్నారు. సోమవారం ప్రధానమంత్రి మోడీ పనిచేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ 8931 ,రోజులు పూర్తి చేసి సరికొత్త మైలురాయిని అధిగమించిన ప్రపంచ నేత గౌరవనీయ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జీకి హృదయపూర్వక అభినందనలని చెప్పారు. భారత దేశ సేవలో నిరంతరం అంకిత భావంతో పనిచేస్తూ భారత దేశాన్ని ప్రపంచ వేదికపై అగ్రగామిగా నిలబెట్టిన మీ నాయకత్వం ఆశాజనకం, అపూర్వమని, మీ దూరదృష్టి, ధృడ సంకల్పం, ప్రజలకు అనుగుణంగా పారదర్శక పరిపాలన, నవభారత వికాసానికి బలమైన పునాదులు వేశాయి "వికషిత్ భారత్ 2047, నవ భారత్ నిర్మాణం లక్ష్యంతో మీరు చేపడుతున్న ప్రతి కార్యక్రమం భారత దేశ ప్రజలు అందరికీ గొప్ప ప్రేరణనని అన్నారు. ఆర్థిక, సామాజిక, సాంకేతిక రంగాల్లో భారత దేశాన్ని శక్తివంతంగా తీర్చి దిద్దుతు, పేద, బడుగు, బలహీన వర్గాలు, రైతులు అభ్యున్నతి, యువత సంక్షేమం కోసం మీరు తీసుకొంటున్న నిర్ణయాలు అభినందనీయం, అమోఘమని, భారత దేశానికి మీ నాయకత్వం ఎన్నో, మరెన్నో ఏళ్ల పాటు కొనసాగాలని, మీ నాయకత్వంలో ఈ దేశం శుభిక్షంగా ఉండాలని పలాస నియోజక వర్గం ప్రజలు తరుపున మనసారా కోరుకుంటూ మీకు అభినందనలు ధన్యవాదములు తెలియజేయు చున్నానని చెప్పారు.



# గిరిజన సమస్యల పరిష్కారానికి కృషి

### రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ సొల్లా బొజ్జి రెడ్డి

**మెళియాపుట్టి, మార్చి 23(వార్త):** గిరిజనులు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యలు పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ సొల్లా బొజ్జి రెడ్డి అన్నారు. మెళియాపుట్టిలో సోమవారం గిరిజన సంఘల ఆధ్వర్యంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను గుర్తించి, సమస్య పరిష్కారానికి ఆయా శాఖధికారులు ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని వివిధ అంశాల పై మాట్లాడారు. అంతకుముందు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మెళియాపుట్టిలో ఐటీడీఏ ఏర్పాటు చేయాలని, గ్రానైట్ ఫ్యాక్టరీలను గిరిజన ప్రాంతాల్లో అనుమతులు ఇవ్వరాదని, పోడు పట్టాలు గిరిజనులకు మంజూరు చేయాలని, జిల్లాలో అన్ని గిరిజన మండలాల్లో సామాజిక భవనాలు నిర్మించాలని, గిరిజన పాఠశాలలను జూనియర్ కాలేజీలుగా, జూనియర్ కాలేజీలను డిగ్రీ కాలేజీలుగా అప్ గ్రేడ్ చేయాలని, ఎస్టి సబ్ ప్లాన్ ప్రకారం గిరిజన గ్రామాలభివృద్ధికి ప్రభుత్వం తరఫు నుండి రావలసిన నిధులు మంజూరు చేయాలని, గిరిజన గ్రామాల్లో గల రహదారి, త్రాగునీరు, సాగునీరు, విద్యా వైద్యం తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని, జిల్లాలో బెంతుఒరియా కులస్తుల వారు ఎస్టీలు కాదంటూనే వారిని ఎస్టీలుగా గుర్తించకూడదని వివిధ సమస్యలతో కూడిన విజ్ఞాపన పత్రాలను ఆయనకు అందజేశారు. అంతకుముందు స్థానిక ఎమ్మెల్యే మామిడు గోవిందరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నేతృత్వంలో గిరిజన అభివృద్ధికై చేపడుతున్న అంశాలను తెలియపరిచారు. ఈ కార్యక్రమంలోఎస్టి కమిషన్ చైర్మన్ చైర్మన్ బొజ్జారెడ్డి తోపాటు కమీషన్ సభ్యులు మల్లేష్, సునీత, టెక్కలి ఆర్డీవో టీ. కృష్ణమూర్తి, తహశీల్దారు బి. పాపారావు, ఎంపీడీవో నరసింహ ప్రసాద్ పండా, అధికారులు, జిల్లా గిరిజన చైతన్య వేదిక జిల్లా అధ్యక్షురాలు భైరసింగి ధరణి, మాజీ ఎంపీపీ భైరసింగి లక్ష్మీనారాయణ, జెడ్పీటీసీ గుడ ఎండయ్య, గిరిజన సంఘ నాయకులు అధికారులు ప్రజా ప్రతినిధులు గిరిజనులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.



## ఖచ్చితమైన గణాంకాలే దేశ ప్రగతికి పునాది

**-జనగణన విధుల్లో ఫీల్డ్ ట్రైనర్లది కీలక పాత్ర**

**-కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్**



**శ్రీకాకుళం, మార్చి 23(వార్త):** దేశ భవిష్యత్తు ప్రణాళికల రూపకల్పనకు, ప్రభుత్వ వనరుల శాస్త్రీయ పంపిణీకి అత్యంత ఖచ్చితమైన జన గణాంకాలే ప్రాతిపదిక అని జిల్లా కలెక్టర్, ప్రిన్సిపల్ సెన్సస్ అధికారి స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పేర్కొన్నారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఎన్.ఐ.సి. వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో 'భారత జనగణన-2027'కు సంబంధించి ఫీల్డ్ ట్రైనర్ల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి పదేళ్లకొకసారి నిర్వహించే ఈ మహత్తర ప్రక్రియలో ఫీల్డ్ ట్రైనర్ల బాధ్యత అత్యంత కీలకమని స్పష్టం చేశారు. మార్చి 1, 2027ను సూచిక తేదీగా తీసుకుని నిర్వహించే ఈ గణనలో ఎక్కడా చిన్నపాటి పొరపాట్లకు తావులేకుండా, క్షేత్రస్థాయిలో వాస్తవ గణాంకాలను సేకరించాలని అధికారులను ఆదేశించారు. సమర్థవంతమైన డేటా సేకరణ ద్వారానే ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు అవసరమైన పథకాలు రూపొందించడం సాధ్యమవుతుందని ఆయన వివరించారు. జిల్లాలో ఈ శిక్షణను రెండు విడతల్లో పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. మొదటి విడతలో (మార్చి 23 - 25) 34 మంది ఫీల్డ్ ట్రైనర్లు, ఇద్దరు మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ ఇస్తుండగా.. రెండో విడతలో (మార్చి 26, 28, 29) మరో 36 మందికి శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఈ సెన్సస్ ప్రక్రియ ప్రధానంగా 'హౌస్ లిస్టింగ్ - హౌసింగ్ సెన్సస్', 'పాప్యులేషన్ ఎన్యూమరేషన్' అనే రెండు కీలక దశల్లో జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.వి. లక్ష్మణమూర్తి, సెన్సస్ జాయింట్ డైరెక్టర్ బి.వి.ఎల్. సాయి శేఖర్, స్టాటిస్టికల్ ఇన్వెస్టిగేషన్ అధికారి శివ కుమార్, మాస్టర్ ట్రైనర్లు శేషగిరి, నారాయణరావు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

## బొడ్డపాడులో ఘనంగా భగత్‌సింగ్ వర్ధంతి



**పలాస, మార్చి 23 (వార్త):** బొడ్డపాడు గ్రామంలో భగత్ సింగ్ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోమవారం భగత్ సింగ్, రాజగురు, సుఖ్ దేవ్ ల 95వ వర్ధంతి సందర్భంగా బొడ్డపాడు యువజన సంఘశీ 73వ వార్షికోత్సవంలో బాగంగా కార్మిక వర్గ పతాకాన్ని సీనియర్ నాయకులు మద్దిల మల్లేశ్వర రావు చేతులు మీదుగా ఆవిష్కరించి, భగత్ సింగ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. యువజన సంఘం పతాకానికి సంఘం కార్యధర్శి యమ్ నారాయణ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు. ప్రజా కళామండలి నాయకులు కొర్రాయి నీలకంఠం బృందంచే గీతాలాపనలు చేసారు. బొడ్డపాడు గ్రామంలో అమరవీరుల స్మారక మందిరంలో అతి పిన్న వయస్సులో ఉరికంబాన్ని ముద్దాడిన కామ్రేడ్ భగత్ సింగ్ లతో పాటు రాజగురు, సుఖదేవ్, కామ్రేడ్ చంద్రశేఖర్ లకు స్మరించు కుంటూ నివాళులు, స్వాతంత్ర ఉద్యమంలో అమరులైన వీరులందరికి నివాళలు అర్పించుకుంటూ వారి స్ఫూర్తితోతో మరిన్ని భలమైన ఉద్యమాలు చేపడుతూ ముందుకు సాగాలని, భవిష్యత్ తరం దీన్ని ముందుకు తీసుకుపోవాలని సీనియర్ నాయకులు మద్దిల మల్లేశ్వరరావు పిలుపు నిచ్చారు. అదే స్ఫూర్తితో ముందుకు సాగు తున్న బొడ్డపాడు యువజన సంఘం, కమ్యునిస్టు వడిలో పుట్టిన ఈ సంఘం భగత్ సింగ్ వారసత్వాన్ని ముందుకు తీసుకుపోగలదని సిపిఐ యంయల్ న్యూడెమొక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి వంకల మాదవ రావు ఆశాభావం వ్యక్తం చేసారు. ఇరాన్, క్యూభా లాంటివి చిన్న చిన్న దేశాలపైన ఇజ్రాయిల్, అమెరికన్నా సామ్రజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాటాలు చేయాలని పిహోడబ్ల్యు, స్వేచ్ఛా మహిళా సంఘం, ఐప్వా నాయకులు పి.కుసుమ, పి.నాగమణి, పి.సుందరమ్మ, యమ్ తులసమ్మ, తామాడ వరలక్ష్మి పాల్గొన్నారు.

## శిథిలావస్థలో వంశధార క్వార్టర్స్

**- అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రం**

**- పునర్నిర్మాణం లేక పాడైపోయిన భవనాలు**

**- మహిళల రాకపోకలకు ఇబ్బందులు**

**నరసన్నపేట, మార్చి 23(వార్త):** నరసన్నపేట వంశధార కార్యాలయం వద్ద దశాబ్దాల క్రితం నిర్మించిన క్వార్టర్స్ ప్రస్తుతం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుని నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. సంబంధిత అధికారులు పునర్నిర్మాణంపై చొరవ చూపకపోవడంతో భవనాలు పాడైపోయాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఖాళీ క్వార్టర్స్‌ను కొందరు మందుబాబులు ఆశ్రయంగా మార్చుకుని ఉదయం, రాత్రి వేళల్లో మద్యం సేవించే కేంద్రాలుగా ఉపయోగిస్తున్నారని ఆరోపిస్తున్నారు. దీంతో ఆ ప్రాంతంలో అసాంఘిక కార్యకలాపాలు పెరుగుతున్నాయని తెలిపారు. ప్రత్యేకంగా మహిళలు రాత్రి వేళల్లో రాకపోకలు చేయడానికి భయపడుతున్నామని, భద్రతా సమస్యలు తలెత్తుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని అధికారులు తక్షణమే స్పందించి క్వార్టర్స్‌ను పునర్నిర్మాణం చేయాలని లేదా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రాంతంలో శాంతి భద్రతలు కాపాడేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



## సొంత భవనం లేక ఇబ్బందులు పడుతున్న ఎక్సైజ్ శాఖ




**- అద్దె భవనాల్లోనే కార్యకలాపాలు**

**-ముద్దాయిల విచారణ, వాహనాలకు ఇక్కట్లు**

**నరసన్నపేట, మార్చి 23 (వార్త):** నరసన్నపేట, పోలాకి మండలాల పరిధిలో పనిచేస్తున్న ఎక్సైజ్ శాఖకు ఇప్పటికీ సొంత భవనం లేకపోవడంతో అధికారులు, సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శాఖ ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు అద్దె భవనాల్లోనే కార్యకలాపాలు కొనసాగించడం గమనార్హం. పలుచోట్ల అద్దె భవనాలు మారుస్తూ కార్యకలాపాలు నిర్వహిస్తున్న పరిస్థితి నెలకొంది. ఒక ప్రభుత్వ శాఖకు ఇలాంటి పరిస్థితి రావడం పట్ల స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అద్దె భవనాల్లో ముద్దాయిలను విచారించేందుకు తగిన సౌకర్యాలు లేకపోవడంతో పాటు, వాహనాలను నిలిపేందుకు కూడా సరైన స్థలం లేకపోతుందని సిబ్బంది తెలిపారు. దీంతో విధుల నిర్వహణలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకుని ఎక్సైజ్ శాఖకు సొంత భవనం నిర్మించేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం తగదు

**-ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి-55 వినతుల స్వీకరణ**



**శ్రీకాకుళం, మార్చి 23(వార్త):** పబ్లిక్ గ్రీవెన్స్‌లో స్వీకరించే ప్రజా ఫిర్యాదుల పట్ల ఎటువంటి జాప్యం లేకుండా, నిర్లక్ష్యం చేయకుండా త్వరితగతిన విచారణ జరిపి, అర్జీదారులు సంతృప్తి పొందేలా పూర్తి స్థాయిలో పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి పోలీసు అధికారులకు ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎస్పీ మొత్తం 55 మంది నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం ఫిర్యాదిదారులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని, వాటిని సమగ్రంగా పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. స్వీకరించిన అర్జీలు, వివరాలను జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా తక్షణమే సంబంధిత పోలీసు అధికారులకు తెలియజేసి, చట్ట ప్రకారం చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ప్రజా ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ఎటువంటి నిర్లక్ష్యం లేకుండా వేగవంతంగా పరిష్కారం చూపాలని ఎస్పీ సూచించారు. ఈ క్రమంలో ఎస్పీ స్వయంగా అర్జీదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఆయా ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను నిర్ణీత కాలంలో జిల్లా పోలీసు కార్యాలయానికి నివేదిక రూపంలో పంపించాలని అధికారులను ఆదేశించారు. మొత్తం స్వీకరించిన ఫిర్యాదులు 55 కాగా, వాటిలో కుటుంబ సమస్యలు, మోసపూరిత కేసులు, ఆస్తి వివాదాలు, సివిల్ , సైబర్ , ఇతర అంశాలకు సంబంధించినవి ఉన్నాయి.

## ఆర్టీసీ కాంప్లెక్స్ ల్లో మౌలిక సదుపాయాలు

**శ్రీకాకుళం, మార్చి 23(వార్త):** జిల్లాలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ల్లో మౌలిక సదుపాయాలు కల్పించినట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి సిహెచ్. అప్పలనారాయణ సోమవారం తెలిపారు. శ్రీకాకుళం జిల్లా పరిధిలోని శ్రీకాకుళం, ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి, నరసన్నపేట, పాతపట్నం మరియు అమదాలవలస బస్ స్టేషన్లలో ప్రయాణీకుల సౌకర్యార్థం అనేక మౌలిక వసతులు కల్పించినట్లు పేర్కొన్నారు. శ్రీకాకుళం, నరసన్నపేట బస్ స్టేషన్లలో త్రాగునీటి సదుపాయం కొరకు (స్వచ్ఛ తాగునీరు) =ా ఝ్వతీ్రాశ్రీఖత్ సదుపాయం కల్పించబడినదన్నారు. మిగిలిన అన్ని బస్ స్టేషన్లలో ప్రస్తుతం బోర్ వాటర్ సదుపాయం కలదన్నారు. అన్ని బస్ స్టేషన్ లలో ప్రయాణీకుల సౌకర్యార్థం తగినన్ని కుర్చీలు, సీలింగ్ ఫ్యాన్లు అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. ప్రతి రోజు అన్ని బస్ స్టేషన్లను పరిశుభ్రంగా ఉంచటం జరుగుతుందని వివరించారు. జిల్లా కేంద్రమైన శ్రీకాకుళం, టెక్కలి, నరసన్నపేట, పలాస బస్ స్టేషన్లలో ఇటీవల మరుగుదొడ్లును ఆధునీకరించినట్లు పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని బస్సు స్టేషన్లలో ప్రయాణీకుల అభిప్రాయాలకు అనుగుణంగా అన్ని రకములైన లోపాలను ఎప్పటికప్పుడు సరిచేయడం జరుగుతోందన్నారు. అంతే కాకుండా మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించుటలో భాగంగా అదనపు కుర్చీలు, ఫ్యాన్లు, మరుగుదొడ్లు మంజూరు కొరకు రాష్ట్ర కార్యాలయంనకు ప్రతిపాదనలు పంపినట్లు వివరించారు.

## ఘనంగా దొమ్మేటి వెంకట రెడ్డి జయంతి

**శ్రీకాకుళం, మార్చి 23(వార్త):** ప్రఖ్యాత సామాజిక సంస్కర్త దొమ్మేటి వెంకట రెడ్డి ౧173వ జయంతి వేడుకలను సోమవారం శ్రీకాకుళం జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (క్రైమ్) పి. శ్రీనివాసరావు వెంకట రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,... 18వ శతాబ్దంలో అట్టడుగువర్గాల విద్యాభివృద్ధికి విశేషంగా కృషి చేసిన మహనీయుడు వెంకట రెడ్డి అని కొనియాడారు. శెట్టిబలిజ సమాజంలో విద్యా విస్తరణ, ఐక్యత, ఆత్మగౌరవం కోసం నిరంతరం పోరాడిన గొప్ప సంస్కర్తగా ఆయనను అభివర్ణించారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని వెంకటరెడ్డికి నివాళులర్పించారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546